www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 10 | వెల రూ.5.00

ప్రజానావ పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

Published from: Hyderabad, Karimnagar, Circulated to : Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 108 | ఆదివారం | 29 మార్చి, 2026



## రావద్దన్నారు.. పదవి పోతుందన్నారు

- నోయిడా సెంటిమెంట్‌ను తుడిచిపెట్టాం..
- మూఢనమ్మకాలతో అభివృద్ధిని గాలికొదిలేశారు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 4

ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా శనివారం నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గత పాలకుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న 'నోయిడా సెంటిమెంట్' కారణంగానే గత నాయకులు ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదని ఆయన విమర్శించారు.

## అయోధ్యలో అగ్నిప్రమాదం

- అగ్నికి ఆహుతి అయిన యజ్ఞశాల పందిళ్లు
- ప్రమాదంలో ప్రాణనష్టం లేదని వివరణ

4



# అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణ

## రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా అన్నింటిపైనా దర్యాప్తు

- రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా అన్నింటిపైనా దర్యాప్తు
- అక్రమాలను సహించేది లేదని వెల్లడి
- ప్రభుత్వ ఖజానాకు గండికొడితే ఊరుకోం
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన



"మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శాసనసభలో ప్రకటించారు. సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తాం. సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుపై విచారణకు ప్రభుత్వం సిద్ధం అని తెలిపారు. గంగుల కమలాకర్ అక్రమ గ్రానైట్ మైనింగ్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్‌పై విచారణకు సిద్ధం అని ప్రకటించారు."

**ప్రజానావ, హైదరాబాద్:** రాఘవ కన్‌స్ట్రక్షన్ తోపాటు అన్నింటిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నాం అని తెలిపారు. విచారణలో నిజాలు నిగ్గు తేల్చి శాసనసభలో నివేదిక పెడతాం. ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆర్ఎస్ నేతలు, వారి బంధువులే. వద్దిరాజు రవిచంద్ర వంటివారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. స్వయంగా హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు ఇసుక మాఫియా నడిపారు. అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతూ సాగే అక్రమ మైనింగ్ వ్యవహారాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శించారు. మిగతా 2 లో



## మూసీని అడ్డుకుంటే శివతాండవమే

అడ్డుకున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారు
మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం
దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం
మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సీఎం రేవంత్ 2

## తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం
ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను ప్రారంభించిన సీఎం

## చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

వివరాలు 2వ పేజీలో

## ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో

- అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం
- మెట్రో విస్తరణకు మార్గం సుగమం
- తీర్మానం ప్రవేశ పెట్టిన సీఎం రేవంత్

.. వివరాలు 2లో




## పోలీస్ శాఖపై నిర్లక్ష్యం

- నియామకాల్లో తీరని జాప్యం
- ఆర్టీసీ, బీసీ, సంక్షేమంలోనూ అదే వైఖరి
- అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ 3



## మరోమారు పెరిగిన బంగారం ధరలు



2

## కాళేశ్వరం అవినీతికి కేసీఆర్ బాధ్యుడు

- అవినీతిని పట్టుకోవడంలో సీఎం రేవంత్ విఫలం
- కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్ 3



## భద్రాచలంలో గవర్నర్ దంపతులు

3



## మొజ్తబా ఖమేనీ మృతి?

ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
తదుపరి లక్ష్యం క్యూబా అంటూ హెచ్చరికలు 4





## 'లాక్‌డౌన్' ప్రసక్తే లేదు..

వదంతులు నమ్మొద్దు
కేంద్ర ప్రభుత్వం 4



# చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

## పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

## అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ

## అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు అందచేత

**ప్రజానావ, హైదరాబాద్:** దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ ఉప్మా, కిచిడీ మిక్స్ ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని సీఎం అన్నారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. అంగన్వాడీ భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖపై తీవ్ర నిర్లక్ష్యం


## నియామకాల్లో తీరని జాప్యం

## ఆర్టీసీ, బీసీ, సంక్షేమంలోనూ అదే వైఖరి

## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్

**ప్రజానావ, హైదరాబాద్:** పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. పోలీస్ నియామకాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడు అయితే ఎక్కడున్నా లడ్డూ వస్తుందని అంటారు.. కానీ ముఖ్యమంత్రి వద్దనే పోలీసు శాఖ ఉన్నప్పటికీ ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడే వారు పోలీసులు అని.. రాష్ట్రం కోసం సమాజం పనిచేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులను కేసీఆర్ ఎంతగానో గౌరవించారని అన్నారు. 40, 50 పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. కొత్త కమిషనరేట్లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సంక్షేమంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు మాత్రమే టీఏలు, డీఏలు ఇస్తున్నారని తెలిపారు. ఏడు టీఏ బిల్లులు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పోలీసుల భద్రత పథకాన్ని ఒక లక్షకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో ప్రమోషన్లను పక్కనబెట్టారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులకు ఈహెచ్‌ఎస్‌ను ఇంప్లిమెంట్ చేస్తలేరని పేర్కొన్నారు. 2024 తర్వాత ఇప్పటివరకు పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టలేదని అన్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం కంటే 400 కోట్ల బడ్జెట్‌ను ఎందుకు తగ్గించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. పెంచాల్సిన బడ్జెట్ ఎందుకు తగ్గిందని నిలదీశారు. మా ప్రశ్నలకు మంత్రి నుంచి ఎలాంటి అస్యూరెన్స్ లేదని మండిపడ్డారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు , కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని హరీశ్‌రావు అన్నారు. పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయనందుకు నిరసనగా, పోలీసుల ఆరోగ్య భద్రతా పథకంపై భరోసా ఇవ్వనందుకు నిరసనగా, పోలీసు శాఖలో ఉన్న 17వేల ఖాళీల భర్తీపై సమాధానం చెప్పనందుకు నిరసనగా, పోలీసులకు కొత్త వాహనాల విషయంలో సమాధానం చెప్పనందుకు నిరసనగా, బీసీల ఆత్మగౌరవ విషయంలో స్పష్టత ఇవ్వనందుకు నిరసనగా, బీసీ సబ్ ఎ÷–లాన్ నిధుల కేటాయింపుపై వైఖరి చెప్పనందుకు నిరసనగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింటెడ్ డేట్ చెప్పనందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని ప్రకటించారు.

# మరోమారు పెరిగిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరల్లో అంచనాలకు అందని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గత రెండు రోజులుగా ధరల్లో ఓ మోస్తరు మార్పులు కనిపించినప్పటికీ నేడు అనూహ్యంగా భారీ స్థాయిలో ధరలు పెరిగాయి. భారత్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర సగటున రూ.2,500 మేర పెరిగింది. కిలో వెండి ధరలో రూ.5 వేల మేర పెరుగుదల కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (మార్చి 28) ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090కు చేరుకుంది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధర రూ.2,510 మేర పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.2,300ల మేర పెరిగి రూ.1,35,750కు చేరుకుంది. కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే రూ.5 వేల మేర ఎగబాకింది. ప్రస్తుతం రూ.2.5 లక్షల వద్ద కొనసాగుతోంది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ 24 క్యారెట్ల పసిడి ధర 4,492 డాలర్ల వద్ద కదలాడుతోంది. ఔన్స్ వెండి ధర 69 డాలర్లుగా ఉంది.

# అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణ

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడ గండి పడినా, ఖనిజ సంపద దోపిడీకి గురైనా తాము చూస్తూ ఊరుకోబోమని, అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన రాఘవ కన్స్ట్రక్షన్స్ అంశంపై ముఖ్యమంత్రి సాక్ష్యాధారాలతో సమాధానమిస్తూ, ఇప్పటికే ఆ సంస్థకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ జరిపిన విచారణలో భాగంగా రాఘవ కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుండి భారీ మొత్తంలో పన్నులు వసూలు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సినరేజ్ ఛార్జీల కింద రూ. 1,52,97,825, అలాగే పర్మిట్ ఫీజు కింద రూ. 22,25,446 మొత్తాన్ని ప్రభుత్వం ఇప్పటికే ఆ సంస్థ నుండి కట్టించుకుందని ఆయన సభకు తెలిపారు. ఎవరైనా మంత్రుల పేర్లు చెప్పుకుని లేదా రాజకీయ పలుకుబడితో పన్నులు ఎగ్గొట్టాలని చూస్తే చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ఖజానాకు రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంలో రాజీపడేది లేదని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు.

# తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

- గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం
- ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను ప్రారంభించిన సీఎం


**ప్రజానావ, హైదరాబాద్:** ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. తమ కేబినెట్‌లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి క్రీడలు ఓ ఉపశమనం అని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణ ఒకప్పుడు క్రీడల రాజధానిగా ఉండేది. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కనుమరుగైందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 'యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు యత్నిస్తున్నాం. ఫామ్‌హౌస్‌లు, పబ్బులు వంటివాటికి యువత దూరంగా ఉండాలి. బీఆర్ఎస్ ఆలోచనలు ఫామ్‌హౌస్‌లు, పబ్బుల్లో పార్టీలు, విందులే' అని ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించారు రేవంత్. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం సహా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపుతున్నామన్న ఆయన.. వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్–2026' పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకోగా.. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేసేవారికి ఇది అద్భుత అవకాశం అన్నారు. ఇక్కడ అద్భుతంగా ఆడలేకపోవచ్చు గానీ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఎల్బీ స్టేడియం వేదిక అవుతుందన్నారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన వారు మంత్రివర్గంలో ఉన్నారు. క్రికెట్‌లో దేశానికి వన్నె తెచ్చిన అజారుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారు. రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కరవైంది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహించాం అన్నారు. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఫుట్‌బాల్



దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చాం అని అన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. మెస్సీ ఇక్కడికి వస్తే.. హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. ఎల్బీ స్టేడియం రాజకీయ కార్యకలాపాలకే పరిమితమైంది. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేయబోతున్నాం. బేగంపేట హాకీ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. ఫుట్‌బాల్‌లో గతంలో దేశానికి మెడల్స్ తెచ్చిన వారిలో నలుగురు మన ప్రాంతానికి చెందినవారున్నారు. మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పించాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# మూసీని అడ్డుకుంటే శివతాండవమే





- ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ధి చెబుతారు
- మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం
- దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం
- మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సిఎం రేవంత్

**ప్రజానావ, రంగారెడ్డి:** రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని దానిని మార్చాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, సిఎస్ రామకృష్ణారావు,డిజిపి శివధర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో

## అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం

## తీర్మానం ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్

**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది. నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని పక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్–1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్–2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవు తున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్–1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్' ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుందని వివరించారు. ఈ స్వాధీన పక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించింది. ఫేజ్–2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్–2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం నేరుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు , కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఫేజ్–2 విస్తరణకు త్వరితగతిన ఆమోదం పొందేందుకు కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, మెట్రో రైలుపై ప్రభుత్వ పెత్తనం పెరగడం వల్ల సామాన్య ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని, నగరం ప్రపంచ పటంలో ఒక అత్యాధునిక రవాణా వ్యవస్థ కలిగిన మెట్రోపాలిటన్‌గా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే అసెంబ్లీలో తీర్మానాలను ఏకపక్షంగా ఆమోదించడం సరికాదని ఎమ్మెల్యే హరీష్‌రావు పేర్కొన్నారు. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు. నష్టాలతో సతమతమవుతున్నామని, మెట్రో రైలు నిర్వహణ నుంచి తప్పుకొంటామని నాలుగైదేళ్లుగా ఎల్‌అండ్‌టీ సంస్థ చెబుతోంది. ఇదే విషయాన్ని గత సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లింది. సుదీర్ఘ చర్చల తర్వాత ఎల్‌అండ్‌టీ వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణంతో పాటు సంస్థ ఈక్విటీ వాటా రూ.2 వేల కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రో రైలును టేకోవర్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు లేకుండానే ప్రభుత్వం కార్యకలాపాలను నిర్వహించనుంది. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని హరీష్ రావు అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు.

# కాళేశ్వరం అవినీతికి కేసీఆర్ బాధ్యుడు

- అవినీతిని పట్టుకోవడంలో సీఎం విఫలం
- కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్



**ప్రజానావ, కరీంనగర్:** కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. మరోసారి ప్రభుత్వం, మాజీ సీఎం కేసీ ఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యం, కవిత కొత్త పార్టీ, తాజా రాజకీయ పరిణామాలపై బండి సంజయ్ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీ డియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రా జెక్ట్‌కు కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపి పెట్టుకొని ప్రాజెక్టును డిజైన్ చేసింది ఆయనే. ఈ ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం. ప్రజలు ప్రతి విషయాన్నీ గమనించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారు' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో అధికార ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు.'సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలం గాణ సమాజం తలదించుకునేలా ఉంది. ప్రజలు సైతం ఆయన భాషపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయన వ్యవహార శైలి మార్చుకుంటే మంచిదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించారు. ముఖ్యమంత్రికి ఎన్నికల ముందు గుడ్లు గుర్తుకు వస్తాయి. గాడిద గుడ్లు అంటారు. ఎన్నికలు అయిపోయాక తొండలు గుర్తుకు వస్తాయి. తొక్కుడు గుర్తుకు వస్తుందన్నారు. కాళేశ్వరం గురించి ప్రస్తావిస్తూ.. ఆ ప్రాజెక్టును డిజైన్ చేసింది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు.. కాళేశ్వరం కూలిపోవడానికి అప్పుడున్న బీఆ ర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌లు కలిసే రాజకీయం చేస్తారని ఆరోపించారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణకి ముఖ్యమంత్రి.. ఉత్తరాది రాష్ట్రాల నాయకుడు కాదు. ముందు మీరు ప్రకటించిన మొదలు ఆరు గ్యారంటీలు అమలు చెయ్యాలి. కేంద్రం ఏమిస్తున్నదో తెలంగాణ ప్రజానీకానికి తెలుసు. తెలంగాణ రాష్ట్రం ఖజానా పరిస్థితి బాగాలేదు.' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెడతారనే ప్రచారంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ..'తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఇది సంకేతం. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ స్థాపించే హక్కు కలిగి ఉంటారు. అది వారి వ్యక్తిగత, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించింది. కవిత కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచనను స్వాగతిస్తున్నాం' అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యయుతంగా ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు.. ప్రజలకు ఉపయోగ పడితే ఆ ఆ పార్టీలను వారు స్వాగతిస్తారన్నారు.

# బెంగాల్లో గెలిచాక ఢిల్లీలో పాగా వేస్తాం

- మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు



**కోల్‌కతా:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్లో శుక్రవారం రామనవమి శోభాయాత్ర జరుగుతున్న సమయంలో ఘర్షణలు చోటుచేసుకోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమబెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే బీజేపీ దేశంలో అధికారం కోల్పోవడం ఖాయమని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఢిల్లీని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ముందుకు వెళ్తానని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని రాణిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగించి ప్రజలందరినీ బయటకు గెంటేస్తారని మమత ఓటర్లను హెచ్చరించారు. తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ బీజేపీ నేతలు అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి ఎన్నికల కమిషన్‌ను బీజేపీ పావులా వాడుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. రాణిగంజ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగిపడుతుండడం వల్ల అక్కడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మమత ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను విడిచిపెట్టి.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లే వారికి తమ ప్రభుత్వం గృహవసతితోపాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. బెంగాల్‌లో గెలువగానే దేశంలోని ఇతర రాజకీయ పార్టీలతో కలిసి కేంద్రంలో బీజేపీని గద్దె దించుతానని హెచ్చరిక చేశారు.

# బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దు

- ఐపిఎల్ ప్రారంభంతో యువతకు సిపి సజ్జనార్ హెచ్చరిక



**ప్రజానావ, హైదరాబాద్:** బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌ స్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్-2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉ ందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

# ఇరాన్‌పై భూతల దాడులు చేయాల్సిన అవసరం

**అనుకున్న సమయానికన్నా ముందే యుద్ధం ముగింపు**

**అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో**

**ప్యారిస్:** ఇరాన్‌పై అనుకున్న సమయం కంటే ముందే దాడులను ముగిస్తామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో అన్నారు. మరికొన్ని వారాల్లో ఇరాన్ యుద్ధం ముగుస్తుందని తెలిపారు. ఇరాన్‌పై భూతల దాడులు చేయాల్సిన అవసరం లేకుండానే తమ లక్ష్యాలను సాధిస్తామని అన్నారు. తమ దాడులు మరో రెండు, మూడు వారాల్లో పూర్తవుతాయని, అప్పటికి టెహ్రాన్ పూర్తిగా బలహీనపడుతుందని పేర్కొన్నారు. ఫ్రాన్స్‌లో జీ-7 ప్రతినిధులతో సమావేశమైన అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రుబియో మాట్లాడారు. 'హోర్ముజ్‌లో జరిగే చమురు రవాణాపై ఇరాన్ సుంకాలు విధించకుండా నిరోధించడమే మా తక్షణ కర్తవ్యం. ఆ సుంకాల వల్ల అనేక దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. యుద్ధం ముగింపుపై చర్చల కోసం ఇరాన్ పాలకవర్గం మాకు సందేశాలు పంపింది. అయితే మేం ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు' అని రుబియో తెలిపారు. పశ్చిమాసియాలో అమెరికా తన సైనిక బలగాల మోహరింపును ఇటీవల భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై కూడా రుబియో మాట్లాడారు. 'ఇరాన్‌పై భూతల దాడులు చేయాలని మేం అనుకోవడం లేదు. కానీ, అత్యవసర పరిస్థితులు తలెత్తితే మాత్రం భూతల దాడులకు దిగక తప్పదు. అందుకే అమెరికా దళాలు ఇరాన్ చుట్టూ మోహరిస్తున్నాయి' అని రుబియో స్పష్టం చేశారు.





# భద్రాచలంలో గవర్నర్ దంపతులు

**భద్రగిరి మార్ట్ ను ప్రారంభించిన శుక్లా**

**ప్రజానావ, భద్రాచలం:** భద్రాచలంలో అంగరంగ వైభవంగా శ్రీరాముని పట్టాభిషేక మహోత్స వాన్ని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా దంపతులు తిలకించారు. బద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా సాగింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు,గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు తొలిసారి వచ్చిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ప్రజా ప్రతినిధులు , అధికారులు ఘన స్వాగతం పలికారు. బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ హెలీప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి గవర్నర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ ఐటిడిఏ ఆధ్వర్యంలో భద్రాచలంలో - భద్రగిరి మార్ట్ ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. మార్ట్ లో విక్రయానికి ఉంచిన గిరిజన ఉత్పత్తుల గురించి భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్, సహాయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్ లు గవర్నర్ కు వివరించారు. గిరిజన ఉత్పత్తులను పరిశీలించి, పలు ఉత్పత్తులను గవర్నర్ దంపతులు కొనుగోలు చేశారు.

# పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య



మమత | మణికంఠ | ప్రళయశ్రీ

**ప్రజానావ, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా కంది మండలం జులకల్‌లో శనివారం దారుణం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలకు విషమిచ్చిన తల్లి.. తానూ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతులను మమత (28), కుమారుడు మణికంఠ (5), కుమార్తె ప్రళయ (4) గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది జనవరిలో రోడ్డు ప్రమాదంలో మమత భర్త మృతి చెందాడు. భర్త చనిపోయడాని మనస్తాపానికి గురైన మమత పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు జులకల్ చేరుకొని వివారాలు సేకరిస్తున్నారు.

# ఫుట్‌బాల్ క్రీడాకారిణి పట్ల అసభ్య ప్రవర్తన : కేసు నమోదు

**ప్రజానావ,** జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్న క్రీడాకారిణితో కొందరు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తించారు. కుక్క విషయంలో మొదలైన గొడవ చివరకు క్రీడాకారిణి కుటుంబానికి ప్రాణభయంగా మారింది. కొందరు మందుబాబులతో క్రీడాకారిణికి కుక్క విషయంలో గొడవ జరిగింది. దీంతో వారు ఆమెను వేధించడం ప్రారంభించారు. హయత్ నగర్ పరిధిలో నివసిస్తున్న ఆమె ఇంటిపై దాడి చేశారు. ఇంట్లోకి చొరబడి క్రీడాకారిణి, ఆమె చెల్లెళ్లతో అసభ్యంగా ప్రవర్తించారు. రోజూ వారి ఫోటోలు తీసి వేధిస్తున్నారు. మందుబాబుల దాడిలో గాయపడిన క్రీడాకారిణి హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో హయత్‌నగర్ పోలీసులు నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభిచారు.

# ఆశాల చలో హైదరాబాద్

## ఎక్కడికక్కడే పోలీసుల అరెస్ట్




**ప్రజానావ, హైదరాబాద్:** చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించేందుకు బీఆర్‌టీయూ నేతలు, ఆశావర్కర్లు ముందస్తుగా అనుమతులు తీసుకున్నారు. కానీ ర్యాలీకి పర్మిషన్ ఇచ్చినట్లే ఇచ్చి బీఆర్‌టీయూ ఆశావర్కర్లను అక్రమంగా అరెస్టు చేసారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్; కార్యదర్శి మారయ్యను అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఆశావర్కర్లు ఎక్కడికక్కడ అరెస్టు చేసారు. పోలీసుల తీరుపై ఆశావర్కర్లు, బీఆర్‌టీయూ నేతలు మండిపడుతున్నారు. ధర్నాకు అనుమతులు ఇచ్చిన తర్వాత ఎందుకు అరెస్టు చేస్తున్నారని పోలీసులను నిలదీస్తున్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు దక్కుతున్న గౌరవమిదేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి తీరుతామని స్పష్టం చేశారు.



సంపాదకీయం

# ట్రంప్‌ను నిలువరించేదెవరు?

పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలు ఆరేలా లేవు. పరస్పర దాడులతో మరింత ఉద్రిక్తంగా మారుతోంది. దీంతో ప్రపంచ దేశాలు ఏమీ చేయలేని దుస్థితిలో ఉండిపోయాయి. అమెరికాను నిలువరించే పరిస్థితి ఏ దేశానికి లేకుండా పోయింది. సుంకాలు విధించినా చైనా, భారత్ లాంటి దేశాలు సైతం కిమ్మనకుండా మిన్నకుండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు చమురు సంక్షోభం నేపథ్యంలోనూ అమెరికాను కట్టడి చేయగల శక్తి ఎవరికీ లేకుండా పోయింది. ట్రంప్ కూడా ఆయుధ బలంతో రెచ్చిపోతున్నాడు. ఇది ప్రపంచ వినాశనానికి కంకణం కట్టుకున్నట్టుగా ఉంది. ఇంతటితోనే ఇది ఆగుతుందనుకోవడానికి లేదు. ఇక భూతలదాడులు జరిగితే నష్టం మరింత తీవ్రంగా ఉంటుంది. ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా 10లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని ఇప్పటికే వెల్లడించింది. ఓ వైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో తీవ్ర సంక్షోభం నెలకొన్నా పట్టించుకోవడం లేదు. ఆర్థికంగా దెబ్బతింటున్న పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌తో సహా అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్లు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే.. వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్‌జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థనలు వస్తున్నట్లు వెల్లడించాయి. ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో యుద్ధంలో పాల్గొనేందుకు అర్హత వయసును కూడా ఇరాన్ తగ్గించినట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల పిల్లలను సైతం యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి 'ఫర్ ఇరాన్' అని పేరు పెట్టినట్లు వెల్లడించాయి. పెట్రోలింగ్, చెక్ పాయింట్ల దగ్గర వీరిని ఉంచనున్నారు. ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైనిక కొరతను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. అవసరమైన దానికంటే 12వేల మంది తగ్గినట్లు సైనికాధికారులు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కొరత కారణంగా ఐడీఎఫ్ కూలిపోయే ప్రమాదం ఉందని.. ఆ సంస్థ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇకపోతే హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ సాగిస్తున్న దిగ్బంధనంతో నౌకాయానం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభానికి ఇది కారణమైంది. ఇప్పుడు మరో జలసంధికి ముప్పు ముంచుకొచ్చింది. తమ ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే బాబ్ అల్ మాండెబ్ జలసంధిని అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించడమే ఇందుకు కారణం. ఆ నౌకామార్గమూ మూసుకుపోతే ప్రపంచానికి మరిన్ని కష్టాలు తప్పవంటున్నారు. అరేబియా ద్వీపకల్పానికి పశ్చిమాన మరో జలమార్గమే బాబ్ అల్ మాండెబ్ జలసంధి. అరబిక్ భాషలో బాబ్ అల్ మాండెబ్ అంటే 'కన్నీటి ద్వారం' లేదా 'విషాద ద్వారం' అని అర్థం. అక్కడ ప్రతికూల పరిస్థితుల కారణంగా అనేక నౌకలు ప్రమాదానికి లోనయ్యాయి. అందువల్లే ఈ మార్గానికి ఆ పేరు వచ్చింది. 1869లో సూయజ్ కాలువను తెరిచాక మాండెబ్ జలసంధికి ప్రాముఖ్యత పెరిగింది. ఇది మధ్యధరా సముద్రం, హిందుమహాసముద్రానికి మధ్య కీలక లంకెగా మారింది. మాండెబ్ జలసంధికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇది యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయెజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక నడవాగా మారింది. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌కు మధ్య ద్వారంలా వ్యవహరిస్తోంది. దీని వెడల్పు 30 మీటర్లు మాత్రమే.ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకల మధ్య మాండెబ్ జలసంధి ఒక గేట్‌వేలా పనిచేస్తోంది. నిత్యం ఈ మార్గంలో 45 లక్షల బ్యారెల్ల చమురు రవాణా అవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యం లో 10-12 శాతం దీని గుండానే పయనిస్తోంది. ఏటా రూ.93.95 లక్షల కోట్ల విలువైన సరకులు మాండెబ్ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా. తన అజమాయి-షీలో పనిచేసే హూతీలను ఇప్పటికే మాండెబ్ మార్గంలో ఇరాన్ మోహరించింది. యె-మెన్‌లోని ఈ ముఠా.. ఎర్ర సముద్ర తీరంలోని కొన్ని భాగాలను నియంత్రిస్తోంది. సముద్రంలోని లక్ష్యాలపై దాడి చేసే సామర్థ్యం ఈ ముఠాకు ఉంది. 2023 అక్టోబరు 7న గాజా యుద్ధం చెలరేగాక.. పాలస్తీనావాసులకు సంఘీభావంగా హూతీలు రంగంలోకి దిగారు. ఇరాన్, చైనాలు అందించిన డ్రోన్లు, నౌకా విధ్వంసక క్షిపణులు, విస్ఫోటక బోట్లతో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీంతో ప్రధాన నౌకాయాన కంపెనీలు వేరే మార్గంలో పయనించాల్సి వచ్చింది. 2 నెలల కాలంలో 134 నౌకలపై దాడి చేశారు. ఫలితంగా ఎర్ర సముద్ర వర్తక నడవాలో అంతర్జాతీయ వాణిజ్యం 60 శాతానికిపైగా తగ్గింది. ఇందులో చాలావరకూ పశ్చిమ దేశాలతో ముడిపడినవే. నాలుగు నౌకలు మునిగిపో యాయి. మాండెబ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధిస్తే సరకు రవాణా నౌకలు ఆఫ్రికాలోని దక్షిణ భాగం నుంచి పయనించాల్సి వస్తుంది. దీనివల్ల ప్రయాణ సమయంతోపాటు ఖర్చులూ పెరుగుతాయి. ఇది అంతిమంగా చమురు ధరల పెరుగుదలకు, ఇంధన మార్కెట్‌లో మరింత అస్థిరతకు దారితీయవచ్చు. అయితే ఈ జలసంధి దిగ్బంధనానికి ప్రయత్నిస్తే అమెరికా గట్టిగా ప్రతిఘటించవచ్చు. మాండెబ్ జలసంధిలో జిబౌటి వైపున అగ్రరాజ్యానికి భారీ సైనిక స్థావరం ఉంది.

# మొజ్తబా ఖమేనీ మృతి?

- ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- తదుపరి లక్ష్యం క్యూబా అంటూ హెచ్చరికలు



**వాషింగ్టన్:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా కలకలం రేపుతున్నాయి. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా భావిస్తున్న మొజ్తబా ఖమేనీ మరణించి ఉండొచ్చని ట్రంప్ పేర్కొన్నారు. మయామిలో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ సమ్మిట్‌లో మాట్లాడిన ట్రంప్, అమెరికా సైనిక దాడులు ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని పూర్తిగా దెబ్బతీశాయని చెప్పారు. "ఇరాన్ నౌకాదళం అంతమైపోయింది, వైమానిక దళం నిర్వీర్యమైంది, వారి రక్షణ వ్యవస్థలు పూర్తిగా కూలిపోయాయి" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని అంచనాలకు మించి దెబ్బతీశామని, క్షిపణి, డ్రోన్ కర్మాగారాలను ధ్వంసం చేశామని తెలిపారు. అయితే ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ధ్రువీకరించలేదు. సాధారణంగా అయతొల్లా అలీ ఖమేనీ కుటుంబానికి సంబంధించిన విషయాలను ఇరాన్ అత్యంత గోప్యంగా ఉంచుతుందన్నది తెలిసిందే. ఇరాన్, వెనిజులా తర్వాత తమ తదుపరి లక్ష్యం క్యూబా కావచ్చని ట్రంప్ హెచ్చరించారు. అవసరమైతే సైనిక చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. "కొన్నిసార్లు సైన్యాన్ని ఉపయోగించాల్సి వస్తుంది.. తర్వాతి వంతు క్యూబాదే" అని వ్యాఖ్యానించారు. అయితే వెంటనే ఆ వ్యాఖ్యలను కొంత సర్దిచెప్పే ప్రయత్నం కూడా చేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ అమెరికాతో చర్చలు జరుపుతున్నట్టు అంగీకరించారు. భవిష్యత్తులో ఉద్రిక్తతలు పెరగకుండా చూడాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కాగా, ట్రంప్ వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకవైపు పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కొనసాగుతుండగా, మరోవైపు క్యూబాపై సైనిక చర్యల సూచనలు రావడం అంతర్జాతీయ ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశముంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రపంచ దేశాలు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి. పరిస్థితి మరింత దిగజారకుండా రాజనీతిక పరిష్కారాలే మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.

# 'లాక్‌డౌన్' ప్రసక్తే లేదు..


- వదంతులు నమ్మొద్దు : కేంద్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా మళ్లీ లాక్‌డౌన్ విధిస్తారంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ స్పష్టం చేస్తూ, దేశంలో ఇంధన కొరత ఏర్పడవచ్చనే ఆందోళనలతో ప్రజలను గందరగోళానికి గురిచేసే వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్న భయంతో పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరుతున్న తరుణంలో, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో ఆర్థిక బిల్లు 2026పై సమాధానం ఇస్తూ దేశంలో లాక్‌డౌన్ విధించే ఆలోచన గానీ అలాంటి ప్రతిపాదన గానీ ప్రభుత్వం వద్ద లేదని తేల్చి చెప్పారు. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న మాట నిజమేనని, అయితే ఎనర్జీ సప్లై చైన్, నిత్యావసరాల రవాణాను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని ఆమె భరోసా ఇచ్చారు. గత నెల రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి ఏకంగా 122 డాలర్లకు చేరినప్పటికీ, సామాన్యులపై భారం పడకుండా ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుందని నిర్మలమ్మ వివరించారు. దీనిలో భాగంగా పెట్రోల్‌పై అదనపు ఎక్సైజ్ సుంకాన్ని రూ. 13 నుంచి రూ. 3కు తగ్గించడమే కాకుండా, డీజిల్‌పై ఉన్న రూ. 10 సుంకాన్ని పూర్తిగా ఎత్తివేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గినప్పటికీ, చమురు కంపెనీలకు మరియు సామాన్య ప్రజలకు భారీ ఊరట లభించనుంది. అంతర్జాతీయంగా పెట్రోల్ ధరలు 20 నుంచి 50 శాతం పెరిగినా, భారత్‌లో ప్రజలకు రక్షణ కల్పించేందుకే ఈ ఎక్సైజ్ సుంకాల తగ్గింపు నిర్ణయం తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు. దేశంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, అసత్య ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం మరోసారి విజ్ఞప్తి చేసింది.

# మారనున్న ఆస్కార్ వేడుకల వేదిక

## 2029 నుంచి పీకాక్ థియేటర్‌లోకి మార్పు



**లాస్‌ఏంజిల్స్:** ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'అకాడమీ అవార్డ్స్' ఆస్కార్ ఒక చారిత్రాత్మక మార్పునకు సిద్ధమవుతోంది. దశాబ్దాలుగా హాలీవుడ్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకలు, 2029 నుంచి లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌లోని కొత్త వేదికకు మారనున్నాయి. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించిన వివరాల ప్రకారం, 2029 నుంచి 2039 వరకు పదేళ్ల పాటు ఈ వేడుకలు లాస్ ఏంజిల్స్ లైవ్ కాంప్లెక్స్‌లోని 'పీకాక్ థియేటర్'లో జరగనున్నాయి. ఇందుకోసం ప్రముఖ వినోద సంస్థ తో అకాడమీ ఒప్పందం కుదు-ర్చుకుంది. 2001 నుంచి ఆస్కార్ వేడుకలకు ఆతిథ్యం ఇస్తున్న హాలీవుడ్ బౌలేవార్డ్ లోని 'డాల్బీ థియేటర్' యుగం, 2028లో జరగబోయే 100వ వార్షికోత్సవ వేడుకలతో ము-ుగియనుంది. అప్పటివరకు ఈ వేడుకలు ఎబిసి ఛానల్‌లోనే ప్రసారమవుతాయి. అయితే, 2029 నుంచి 2033 వరకు జరిగే ఆస్కార్ వేడుకల ప్రసార హక్కులను యూట్యూబ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. దీనివల్ల రెడ్ కార్పెట్, తెరవెనుక విశేషాలు మరియు ప్రధాన వేడుక వంటివన్నీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా అభిమానులు యూట్యూబ్‌లో ఉచితంగా వీక్షించే అవకాశం కలగనుంది. అత్యాధునిక సాంకేతికత కలిగిన వేదికపై సినిమా పండుగను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడానికి ఈ మార్పు ఎంతో దోహదపడుతుందని అకాడమీ ప్రతినిధులు పేర్కొన్నారు.

# అయోధ్య యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం

## అగ్నికి ఆహుతి అయిన పందిళ్లు

## ప్రమాదంలో ప్రాణనష్టం లేదని వివరణ




**అయోధ్య:** అయోధ్యలోని యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రాజ్‌ఘాట్‌లో బటి బాబా ఆశ్రమం సమీపంలో ఉన్న మహాలక్ష్మి నారాయణ యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పెద్ద పెద్ద పందిళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. 10 అగ్నిమాపక వాహనాలు రెండు గంటల్లోనే మంటలను అదుపులోకి తెచ్చాయి. అగ్ని ప్రమాదంలో ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని ఉత్తర ప్రదేశ్ రవాణా శాఖ మంత్రి దయాశంకర్ సింగ్ అన్నారు. మార్చి 20 నుంచి మార్చి 28 వరకు యజ్ఞం జరిగిందని.. తొమ్మిది రోజుల పాటు జరిగిన మహాయజ్ఞం ముగిశాక ఈ అగ్నిప్రమాదం జరిగిందని వెల్లడించారు. యజ్ఞశాల ఖాళీగా ఉన్న సమయంలో ఈ ఘటన జరిగిందని.. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. కానీ లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు చెప్పారు. దాదాపు ఎకరం విస్తీర్ణంలో ఉన్న యజ్ఞశాల నిమిషాల వ్యవధిలోనే బూడిదైపోయింది. ఈ భారీ అగ్నిప్రమాదం రామ మందిరానికి కేవలం 800 మీటర్ల దూరంలో జరిగింది. శనివారం ఉదయం సుమారు 11:30 గంటలకు పూర్ణాహుతితో యజ్ఞం ముగియగానే.. భక్తులు ఇళ్లకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం తర్వాత ఈ ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణం ఇంకా స్పష్టంగా తెలియరాలేదని, దర్యాప్తు చేసేందుకు ఒక సాంకేతిక బృందాన్ని పంపుతామని మంత్రి తెలిపారు. యంత్రాంగం ఈ విషయంపై దర్యాప్తు చేస్తోందని, అసలు కారణం త్వరలోనే వెల్లడయ్యే అవకాశం ఉందన్నారు.


# రావద్దన్నారు.. పదవి పోతుందన్నారు

## నొయిడా సెంటిమెంట్‌ను తుడిచిపెట్టాం..

## మూఢనమ్మకాలతో అభివృద్ధిని గాలికొదిలేశారు

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీ






**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా శనివారం నొయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గత పాలకుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న 'నొయిడా సెంటిమెంట్' కారణంగానే గత నాయకులు ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. నొయిడాలో పర్యటిస్తే పదవి కోల్పోతామనే భయంతో, మూఢనమ్మకాలతో పాలకులు ఇక్కడకు రావడమే మానేశారని, అయితే తాను మాత్రం ప్రజా ఆశీర్వాదమే ప్రధానమని నమ్మి ఈ అపశకున ప్రచారానికి స్వస్తి పలికానని మోదీ స్పష్టం చేశారు. ఒకప్పుడు నాయకులు వదిలేసిన ఈ ప్రాంతమే ఇప్పుడు ప్రపంచ స్థాయి విమానాశ్రయంతో 'నిర్భర భారత్'కు గర్వకారణంగా నిలిచిందని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా తనకు ఎదురైన ఒక ఆసక్తికర అనుభవాన్ని ప్రధాని పంచుకున్నారు. గతంలో సమాజ్‌వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తాను నొయిడా పర్యటనకు సిద్ధమవ్వగా, అప్పటి ముఖ్యమంత్రి స్వయంగా ఫోన్ చేసి రావద్దని వారించారని వెల్లడించారు. "మోదీజీ.. మీరు ఇప్పుడే ప్రధానమంత్రి అయ్యారు, నొయిడా వెళ్లకండి.. వెళ్తే మీ పదవి పోతుంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారని, దానికి స్పందనగా తాను మాత్రం నొయిడా ప్రజల ఆశీర్వాదం కోసం వెళ్తానని, అదే తనకు దీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశం ఇస్తుందని బదులిచ్చానని మోదీ గుర్తు చేసుకున్నారు. మూఢనమ్మకాల కంటే ప్రజల ప్రయోజనాలే మిన్న అని చాటిచెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. నొయిడా శాపం పేరిట గత మూడు దశాబ్దాలుగా యూపీ రాజకీయాల్లో ఒక భయం తాలూకు నీడలు ఉన్నాయి. 1988లో వీర బహదూర్ సింగ్ నుంచి మొదలుకొని ఎన్డీ తివారీ, ములాయం సింగ్ యాదవ్, మాయావతి, కల్యాణ్ సింగ్ వంటి దిగ్గజ నాయకులు నొయిడా పర్యటన తర్వాత పదవులు కోల్పోవడంతో ఈ సెంటిమెంట్ బలపడింది. రాజ్‌నాథ్ సింగ్ వంటి వారు కూడా ఫ్లైఓవర్‌ను ఢిల్లీ వైపు నుంచే ప్రారంభించి జాగ్రత్త పడ్డారు. అయితే, ప్రస్తుత ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పదేపదే నొయిడా పర్యటనలు చేస్తూ, తిరిగి రెండోసారి కూడా అధికారంలోకి వచ్చి ఈ మూఢనమ్మకాలకు ఎట్టకేలకు బ్రేక్ వేశారని ప్రధాని కొనియాడారు. నేడు ప్రారంభమైన ఈ విమానాశ్రయం ఉత్తరప్రదేశ్‌ను అంతర్జాతీయ పటంలో సరికొత్త స్థాయికి తీసుకెళ్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# ఆత్మరక్షణ శిక్షణతో విద్యార్థినుల్లో ధైర్యం

■ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ప్రజానావ, ఆదిలాబాద్:** ఆత్మరక్షణ శిక్షణతో విద్యార్థినుల్లో ధైర్యం వస్తుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులు ఆపద సమయాల్లో ధైర్యంగా ఎదుర్కొనేలా, తమ రక్షణకు తామే ముందుకు రావాలనే లక్ష్యంతో నిర్వహించిన 'ఆత్మరక్షణ శిక్షణ' కార్యక్రమం విజయవంతంగా పూర్తయినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎదురయ్యే అవాంఛనీయ సంఘటనలను ఎదుర్కొనేందుకు బాలికలకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యం కూడా అవసరమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 130కి పైగా జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్, ఆశ్రమ పాఠశాలల్లో సుమారు మూడు నెలల పాటు ఈ శిక్షణను సమర్థవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన 24 పాఠశాలల్లో 72 సెషన్ల పాటు, ఇతర ఉన్నత పాఠశాలల్లో 33 సెషన్ల పాటు నిపుణులైన శిక్షకుల ద్వారా ఆత్మరక్షణ మెళకువలను నేర్పించినట్లు కలెక్టర్ వివరించారు. విద్యార్థినులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా 'ధైర్యే సాహసే లక్ష్మీ' అనే నినాదంతో ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ శిక్షణ ద్వారా బాలికలు ఆకస్మిక దాడుల నుంచి తమను తాము కాపాడుకోవడంతో పాటు పరిసరాల పట్ల అప్రమత్తంగా ఉండే అవగాహన పొందారని తెలిపారు. విద్యార్థినుల నుంచి వచ్చిన స్పందనను చూస్తుంటే భవిష్యత్తులో వారు ఎలాంటి సవాళ్లనైనా ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని సాధించారని నమ్మకం కలుగుతోందని, బాలికల సాధికారతకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం దోహదపడతాయని పేర్కొన్నారు.

# బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామిగా సత్తుపల్లి సింగరేణి

**ప్రజానావ, సత్తుపల్లి:** సింగరేణి సత్తుపల్లి ఏరియా ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 15 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి రవాణా చేయడం ద్వారా నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని విజయవంతంగా సాధించింది. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్‌ను ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ జాయింట్ జనరల్ సెక్రటరీ తీగల క్రాంతికుమార్ మాట్లాడుతూ సత్తుపల్లి ఏరియా బొగ్గు ఖఉత్పత్తి లక్ష్య సాధనలో జీఎం చింతల శ్రీనివాస్ దిశానిర్దేశం కీలకపాత్ర పోషించిందన్నారు. ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో పనిచేయడంతోనే ఈ విజయాన్ని సాధించగలిగామని పేర్కొన్నారు. అనంతరం జీఎం చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడంలో అధికారులు, ఉద్యోగులు, యూనియన్ ప్రతినిధులు బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించారని అన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఆర్థిక సంవత్సరాల్లో కూడా రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ లక్ష్యాలను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం అందరూ అహర్నిశలు




కృషి చేయాలని, సంస్థను కాపాడే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓ టు జీఎం బొల్లం శ్రీనివాస్, ప్రహ్లాద్ (ప్రాజెక్ట్ ఆఫీసర్, జేవీఆర్ ఓసీ), సునీల్ వర్మ (ప్రాజెక్ట్ ఆఫీసర్, కిష్టారం ఓసీ), సోమశేఖర్ (డీజీఎం, జేవీఆర్ సిహెచ్‌పీ), రాజేశ్వరరావు (మేనేజర్, జేవీఆర్ ఓసీ), రామకృష్ణ (మేనేజర్, కిష్టారం ఓసీ), అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలి

■ జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

**ప్రజానావ, మంచిర్యాల:** మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శనివారం లక్షెట్టిపేట మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, చైర్ పర్సన్ దొంత అంజలి, వైస్ చైర్ పర్సన్ రాజేశ్వరి లతో కలిసి బడ్జెట్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల అభివృద్ధికి బడ్జెట్ ప్రణాళికలు సమర్థవంతంగా రూపొందించి అమలు చేయాలని తెలిపారు. వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించి, 2025-26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2026-27 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ లను కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో ప్రతిపాదిత మున్సిపల్ బడ్జెట్‌ను ఖరారు చేశారు. 2026-27 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ రూ.25కోట్ల 80 లక్షల అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని, ఇందులో రూ.3కోట్ల 42లక్షలు సాధారణ ఆదాయం, రూ.21కోట్ల 42లక్షల గ్రాంట్లు, రూ.90లక్షల డిపాజిట్లు, అడ్వాన్సులు,




రూ.5లక్షల 95వేల నిలువ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలో పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని డంప్ యార్డ్‌లో చేపడుతున్న బయో మైనింగ్ పనులను పరిశీలించారు. పాత చెత్తను శాస్త్రీయ పద్ధతులలో వేరు చేసి, పర్యావరణానికి హాని లేకుండా నిర్వహిస్తున్న విధానం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బయో మైనింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆకపెల్లి లక్ష్మణ్‌కు కన్నీటి వీడ్కోలు

**ప్రజానావ, ఇచ్చోడ:** మండలంలోని తలమద్రి గ్రామానికి చెందిన ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకపెల్లి లక్ష్మణ్ అంత్యక్రియలు శోకసంద్రంలో జరిగాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు, బంధువులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ ఆయన పార్థివ దేహానికి పార్టీ వస్త్రాన్ని కప్పి, పాడె మోసి గౌరవప్రదంగా సాగనంపారు. లక్ష్మణ్ మృతి వార్త స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ లక్ష్మణ్ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. రోడ్డు ప్రమాదంలో ఆయన మృతిచెందడం ఎంతో బాధకరమని తెలిపారు. ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని లక్ష్మణ్‌కు తుది వీడ్కోలు పలికారు.





# సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్ట్

## ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.2 కోట్ల మోసం

**ప్రజానావ, ఖమ్మం:** ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి సుమారు రూ.2 కోట్ల మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని వెస్ట్ గోదావరి జిల్లా తణుకు పట్టణంలో అరెస్ట్ చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ వ్యాపారవేత్తకు వాట్సాప్ ద్వారా పరిచయమైన వ్యక్తులు ఎఫ్ఎక్స్ ప్రో అనే ఆన్‌లైన్ ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపారు. వాట్సాప్ ద్వారా ట్రేడింగ్ లింకులు పంపించి పెట్టుబడులు పెట్టేలా చేసి సుమారు రూ.2 కోట్లను సైబర్ నేరగాళ్లు కాజేసినట్లు తెలిపారు. విచారణలో భాగంగా నిందితులు ఎండి సాదిక్, శ్యామ్ బాబు వ్యక్తిగత ఖాతాల్లో సుమారు రూ.7 లక్షలు జమ అయినట్లు గుర్తించారు. దీంతో ఇద్దరినీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని తణుకు పట్టణంలో అరెస్ట్ చేసి ఖమ్మం సైబర్ క్రైమ్ కోర్టులో హాజరుపర్చగా, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ కేసు విచారణలో కీలకంగా పనిచేసిన సైబర్ క్రైమ్ డీఎస్పీ సిహెచ్ఆర్వీ ఫణిందర్, ఇన్‌స్పెక్టర్ కొండపర్తి నరేశ్, ఎస్సై రంజిత్ కుమార్, కానిస్టేబుళ్లు వెంకట కృష్ణరావు, కిషన్ రావుతో పాటు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని అభినందించారు.

# లోక్ అదాలత్‌లో 32 ఎక్సైజ్ కేసుల పరిష్కారం

**ప్రజానావ, నేరడిగొండ:** జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 32 ఎక్సైజ్ కేసులను పరిష్కరించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫీఖార్ అహ్మద్ తెలిపారు. ఈ కేసులకు సంబంధించి మొత్తం 39 మంది వ్యక్తులు కోర్టు ఎదుట హాజరయ్యారని, వారికి విధించిన జరిమానా ద్వారా రూ.1లక్ష 95వేలు ప్రభుత్వ ఖాతాలో జమ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల భారాన్ని తగ్గించేందుకు లోక్ అదాలత్ వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# సీసీ రోడ్డుకు భూమి పూజ



**ప్రజానావ, తాండూర్:** మండలంలోని మాదారం గ్రామపంచాయతీ పరిధిలో డీఎంఎఫ్‌టీ నిధులతో మంజూరైన సీసీ రోడ్డుకు శనివారం మాదారం సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం సీసీ రోడ్డుకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను గతంలో విన్నవించగా ఆయన రోడ్డును మంజూరు చేయించారని తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు, అలాగే సహకరించిన మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గొల్లపల్లి బానేష్, గోదాల లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు మీస శేఖర్, మీనుగు కృష్ణ, చేద్రగిరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ దీక్ష స్వాముల వినూత్న ప్రచారం

## ప్లాస్టిక్ గ్లాసులకు బదులుగా స్టీల్ గ్లాసులు వాడాలని పిలుపు



**ప్రజానావ, తాండూర్:** తాండూర్ మండలం మాదారం గ్రామంలోని కోదండ రామాలయంలో హనుమాన్ దీక్ష స్వాములు శనివారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ గ్లాసులకు బదులుగా స్టీల్ గ్లాసులను వినియోగించడం ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని హనుమాన్ మాల ధరించిన స్వాములు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ దీక్షలో భాగంగా భిక్ష స్వీకరించే సమయంలో ప్లాస్టిక్ గ్లాసులను ఉపయోగించకుండా స్టీల్ గ్లాసులను వాడాలని పిలుపునిచ్చారు. దీక్ష సమయంలో ఆలయాలు, ఇండ్లు, అన్నదాన కార్యక్రమాలు, శుభకార్యాల్లో స్టీల్ గ్లాసులను వినియోగించడం ద్వారా ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ గ్లాసుల్లో వేడి పదార్థాలు పోస్తే హానికర రసాయనాలు విడుదలై ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉందన్నారు. స్టీల్ గ్లాసులను ఉపయోగించడం ద్వారా పర్యావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని వివరించారు.

# ముంబైలో దారుణం

- పనిమనిషిని హత్య చేసిన టీవీ నటుడు అరెస్ట్
- శారీరక సంబంధానికి నిరాకరించడంతోనే ఘాతుకం
- విశాఖపట్నంలో నిందితుడి అరెస్ట్

**ప్రజానావ, ముంబై:** ముంబై సమీపంలోని థానే జిల్లా మీరా రోడ్ ప్రాంతంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. శారీరక సంబంధానికి నిరాకరించడంతో ఆగ్రహానికి గురైన ఓ టీవీ నటుడు తన పనిమనిషిని కత్తితో పొడిచి హత్య చేశాడు. నిందితుడైన ఆశిష్ మెష్రామ్‌ను మీరా రోడ్ పోలీసులు విశాఖపట్నంలో అరెస్ట్ చేశారు. అతను కొన్ని ప్రముఖ టీవీ సీరియల్స్‌లో చిన్నపాటి పాత్రల్లో నటించినట్లు సమాచారం. ఈ ఘటన చిత్ర పరిశ్రమలో కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం, 36 ఏళ్ల సుమన్ కాంబ్లే అనే మహిళ తన భర్త, నలుగురు పిల్లలతో కలిసి కాశీమీరా ప్రాంతంలో నివసిస్తోంది. ఆమె మీరా రోడ్ ఈస్ట్‌లోని సాయిబాబా నగర్‌లో ఉన్న 'చంద్రేష్ అకార్డ్స్' అపార్ట్‌మెంట్‌లో పని చేసేది. అక్కడ నివసిస్తున్న ఇద్దరు సోదరుల్లో ఒకరైన నిందితుడు గత నెల రోజులుగా సుమన్‌పై శారీరక సంబంధం కోసం ఒత్తిడి చేస్తున్నాడు. దీనిని ఆమె తీవ్రంగా వ్యతిరేకించి తన కుటుంబ సభ్యులకు, నిందితుడి అన్నయ్యకు తెలియజేసింది. దీంతో కొంతకాలం పని మానేసింది. తర్వాత నిందితుడు ఇంట్లో లేడని నమ్మబలికిన అన్నయ్య హామీతో, బుధవారం సాయంత్రం సుమన్ తిరిగి పనికి వెళ్లింది. అయితే అక్కడ మాటువేసి ఉన్న నిందితుడు ఆమెపై కత్తితో పలుమార్లు దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సుమన్ సహాయం కోసం తలుపు వరకు చేరుకునే ప్రయత్నం చేసినప్పటికీ, అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణలో నిందితుడి అన్నయ్యకు సంబంధం లేదని భావించినప్పటికీ, అన్ని కోణాల్లోనూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# చిన్నారి మృతి కేసులో షాకింగ్ మలుపు

**వెలుగులోకి అత్యాచారం**

**15ఏళ్ల మైనర్ నేర అంగీకారం.. పోక్సో కేసు**

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో అంబాజోగై ప్రాంతంలో రెండున్నర ఏళ్ల చిన్నారి మృతి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. మొదట్లో ఆ చిన్నారి నీటి ట్యాంకులో పడి మృతి చెందిందని భావించినప్పటికీ, పోస్ట్‌మార్టం నివేదికలో ఆమెపై అత్యాచారం జరిగినట్లు తేలింది. అంబాజోగైలోని స్వామి రామానంద్ తీర్థ గ్రామీణ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన పోస్ట్‌మార్టం పరీక్షలో చిన్నారి అత్యాచారానికి గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఘటన తీవ్రతను గ్రహించిన పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. దర్యాప్తు సమయంలో చిన్నారి మామ కుమారుడైన 15 ఏళ్ల బాలుడు మూడు రోజులుగా ఆహారం తీసుకోకుండా నిరంతరం ఏడుస్తున్నాడని సమాచారం అందడంతో పోలీసులు అతనిపై అనుమానం వ్యక్తం చేశారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా, నేరాన్ని అంగీకరించాడు. అశ్లీల వీడియోలు చూసిన అనంతరం చిన్నారిని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు నిందితుడు ఒప్పుకోవడంతో స్థానికంగా కలకలం రేపింది. చిన్నారి మృతి యావత్ జిల్లాను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ కేసులో భారత శిక్షాస్మృతి, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి దర్యాప్తు చేపట్టారు.

# పోలీస్ నియామక పరీక్షలో విషాదం

**పరుగు పందెంలో యువకుడు మృతి**

**1600 మీటర్ల రేసులో కుప్పకూలిన అభ్యర్థి**

**ప్రజానావ, ముంబై:** పోలీస్ అధికారి కావాలనే లక్ష్యంతో వచ్చిన 23 ఏళ్ల యువకుడు పూణేలో నిర్వహిస్తున్న పోలీస్ నియామక పరీక్షలో పరుగు పందెం సందర్భంగా మృతి చెందిన విషాదకర ఘటన శనివారం చోటుచేసుకుంది. మృతుడిని పురుషోత్తం బర్కుల్ (23), బుల్డానా జిల్లా దేవుల్గావ్ రాజా నివాసిగా గుర్తించారు. పూణే నగర పోలీసులు శివాజీనగర్‌లోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ గ్రౌండ్‌లో నియామక ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 1600 మీటర్ల పరుగు పందెంలో పురుషోత్తం పాల్గొన్నారు. రెండు రౌండ్లు పూర్తి చేసిన అనంతరం మూడో రౌండ్‌లో పరుగెడుతుండగా అతనికి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి నేలపై కుప్పకూలిపోయాడు. ఈ ఘటనతో అక్కడ ఉన్న అభ్యర్థులు, పోలీసులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. తక్షణమే అక్కడి వైద్య బృందం అతనికి ప్రాథమిక చికిత్స అందించింది. ఆ సమయంలో అతని హృదయ స్పందన చాలా నెమ్మదిగా ఉన్నట్లు గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే అంబులెన్స్‌లో ససూన్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. రిక్రూట్‌మెంట్ సమయంలో యువకుడు ఆకస్మికంగా మృతి చెందడం కలకలం రేపింది. పురుషోత్తం మృతితో బుల్డానా జిల్లాలోని అతని స్వగ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై పోలీసులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# నేరాల నియంత్రణకే సీసీ కెమెరాలు

**ప్రజానావ, ఇచ్చోడ:** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహద పడతాయని ఇచ్చోడ సీఐ బండారి రాజు అన్నారు. ఇచ్చోడ మండలంలోని బోరిగామ గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గ్రామంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడంలో, నేరస్తులను పట్టుకోవడంలో ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజలు సామాజిక బాధ్యతగా తమ ప్రాంతాల్లో ఇలాంటి భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారెడ్డి, గ్రామ సర్పంచ్ ఆసిఫ్ ఖాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పనుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- సిరిసిల్ల జిల్లాలో సగటున 50 రోజులు కూడా పనులు కల్పించలేకపోయారు
- బడ్జెట్లో ఈ పథకానికి రూ.95,692 కోట్లను కేటాయించాం
- ప్రతి ఒక్కరికీ 125 రోజులు పని కల్పించండి
- రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్
- సిరిసిల్ల జిల్లా అంకిరెడ్డిపల్లె, ముస్తాబాద్ లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి



**ప్రజానావ, సిరిసిల్ల :** ఏటా 125 రోజులపాటు పని కల్పించాలనే లక్ష్యంతో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం వీబీజీ రామ్ జీ పథకాన్ని తీసుకొచ్చినా, తెలంగాణలో ఆశించిన విధంగా పని దినాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సిరిసిల్ల జిల్లాలో 92 వేల జాబ్ కార్డులుంటే సగటున 50 రోజుల లోపు మాత్రమే పని కల్పిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరికి ఏటా 125 రోజుల పని కల్పించేలా ఈ పథకాన్ని అమలు చేయాలని అధికారులను కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి, ముస్తాబాద్ మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లె గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.25 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముస్తాబాద్ లో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకుముందు అంకిరెడ్డిపల్లెలో ఛత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా శ్రీరామనవమి ఉత్సవాలను ధార్మిక చింతనతో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏ గ్రామం వెళ్లినా, ఏ ఆలయం వెళ్లినా సీతారామచంద్రస్వామి కళ్యాణ వేడుకలతో కళకళలాడాయి. నేడు తంగళ్లపల్లి మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో రూ.25 లక్షల నిధులతో, ముస్తాబాద్ అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద గత ఏడాది తన పార్లమెంట్ నియోజకవర్గంలో 32 కోట్ల 13 లక్షల రూపాయలు ఖర్చు చేసి రోడ్లను నిర్మించామని, మొత్తంగా చూస్తే ఇప్పటి వరకు దాదాపు 700 కోట్ల రూపాయల నిధులను మన పార్లమెంట్ పరిధిలో ఖర్చు చేశామన్నారు.

**ఆశించిన పని దినాల కల్పనలో సర్కార్ విఫలం**

ఈసారి ( 2026-27) కేంద్ర బడ్జెట్‌లో జాతీయ ఉపాధి హామీ పథకం స్థానంలో తీసుకొచ్చిన వీబీ - జి రామ్ జీ పథకానికి 95 వేల 692 కోట్లను కేటాయించామని, గ్రామీణాభివృద్ధి శాఖ బడ్జెట్ లో ఈ ఒక్క పథకానికే 40 శాతం నిధులు కేటాయించామన్నారు. మన తెలంగాణ విషయానికొస్తే... ఈ పథకం కింద 3 వేల కోట్లకుపైగా నిధులు వచ్చే అవకాశముంది. రాష్ట్రంలో సుమారు 32 లక్షల జాబ్ కార్డ్ హోల్డర్లు ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారు. ఏటా 125 రోజులపాటు పని కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చాం, కానీ తెలంగాణలో ఆశించిన విధంగా పని దినాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. ముఖ్యంగా సిరిసిల్ల జిల్లాలో ఆశించిన స్థాయిలో పని దినాలు కల్పించలేకపోతున్నారు. ఈ జిల్లాలో 92 వేల జాబ్ కార్డులుంటే సగటున 50 రోజుల లోపు మాత్రమే పని కల్పిస్తున్నారు. ఆరు వేల లోపు కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పని దినాలు కల్పించారు. ప్రతి ఒక్కరికి ఏటా 125 రోజుల పని కల్పించేలా ఈ పథకాన్ని అమలు చేయాలని అధికారులను కోరుతున్నా... ఈ పథకానికి అయ్యే వ్యయంలో 60 శాతం నిధులను కేంద్రం ఎప్పటికప్పుడు విడుదల చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను సైతం జాప్యం లేకుండా 40 శాతం నిధులను విడుదల చేయాలని కోరుతున్నానని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

**పంచాయితీలు, మున్సిపాలిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం పైసా ఇవ్వడం లేదు**

పంచాయతీలకు, మున్సిపాలిటీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నయాపైసా ఇయ్యడం లేదు. కానీ నిత్యం కేంద్రంపై దుమ్మెత్తి పోయడం అలవాటైంది. మోదీ ప్రభుత్వం ఎరువుల కొరత లేకుండా కావాల్సినన్ని ఎరువులను సరఫరా చేస్తున్నా.. వాటిని అందుబాటులో ఉంచడంలో శ్రద్ధ పెట్టడం లేదు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా సీఎం రేవంత్ రెడ్డి లాగుల తొండలు విడుస్తా అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. గ్యారంటీలు అమలు చేయకుండా ప్రజలను దారి మళ్లిస్తున్నారు. కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీ పెట్టడాన్ని హర్షిస్తున్నాం. ఇది ప్రజాస్వామ్య దేశం. ఎవరైనా పార్టీ పెట్టొచ్చు. ప్రజా సమస్యలపై పోరాడిన పార్టీలకే మనుగడ ఉంటుంది.

# ఆశావర్కర్లను అక్రమ అరెస్టులు చేయడం అన్యాయం

**అరెస్టులు , నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు**

**ఆశ వర్కర్ల పట్ల చిత్త శుద్ధి ఉంటే వెంటనే సమస్యలను పరిష్కరించాలి**

**సిఐటియు రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్**




**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రభుత్వానికి ఆశ వర్కర్ల పైన చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీల కోసం బడ్జెట్ కేటాయించాలని లేని పక్షంలో రానున్న రోజుల్లో పోరాటాలు , ఉద్యమాలను ఉద్భృతం చేస్తామని సిఐటియు రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ హెచ్చరించారు. ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని శనివారం (మార్చి 28న) ఆశా వర్కర్ల చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ మహాధర్నా ను భగ్నం చేయాలని జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆశా వర్కర్లను అక్రమంగా ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్భందించడాన్ని సిఐటియు రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సిరిసిల్లలోని సుందరయ్య నగర్ , అంబేద్కర్ నగర్ పీ హెచ్ సీ ఆశా వర్కర్లను పోలీసులు అరెస్టు చేసి అక్రమంగా పోలీస్ స్టేషన్ లో నిర్భందించిన వారిని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల జరుగుతున్న ఈ సందర్భంగా ప్రభుత్వం ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికారంలో కి వస్తే ఆశా వర్కర్ల కి నెలకి 18 వేల రూపాయల ఫిక్స్ వేతనాన్ని ఇస్తామని, పని భద్రత కల్పిస్తామని అనేక హామీలు ఇవ్వడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 27 నెలలు అవుతున్న ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, ఆశాలకు రావలసిన పారితోషకాలు కూడా సకాలంలో ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకవైపు ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి నిరసన, ధర్నా తెలియజేసే హక్కు కల్పిస్తున్నామని చెబుతూనే మరోవైపు శాంతియుతంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాకు వెళుతున్న ఆశా వర్కర్లను పోలీసుల చేత నిర్బంధించడం అన్యాయం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి ఆశ వర్కర్ల పైన చిత్తశుద్ధి ఉంటే ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీల కోసం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో లావణ్య, చంద్రకళ, రజిత, నిర్మల, మమత, లక్ష్మి, గీత, స్వప్న, జ్యోతి, బాలలక్ష్మి, అనిత తదితరులు ఉన్నారు.

# 7న కోడెల పంపిణీ

**అందుబాటులో 300 కోడెలు**

**ఉమ్మడి కరీంనగర్, పరిసర జిల్లాల చిన్న, సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలి**

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ప్రజానావ, సిరిసిల్ల :** వచ్చే నెల (ఏప్రిల్)7వ తేదీన వేములవాడ పరిధి తిప్పాపూర్ లోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలలో కోడెలను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ గోశాలలోని మధ్యస్థం నుంచి పెద్దగా ఉన్న 300 కోడెలు మంగళవారం ఉదయం 07.00 గంటలకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిసర జిల్లాల రైతులు అర్హులని స్పష్టం చేశారు. కోడెల కోసం 1.5 నుంచి 5 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న సన్నకారు, చిన్నకారు రైతులు అర్హులని, వారు వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్ బుక్, తమ సమీప మండల వ్యవసాయ అధికారి, ఏఈఓ నుంచి ధ్రువపత్రం, ఆధార్ కార్డ్ మొదలగు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ వెబ్సైట్ హెచ్టిటిపిఎస్ : //రాజన్న సిరిసిల్ల. తెలంగాణ. గవ్.ఇన్/లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రైతులు దానికి సంబంధించిన పత్రాలతో వచ్చే నెల (ఏప్రిల్ ) 7వ తేదీన మంగళవారం ఉదయం 07.00 గంటలకు వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ గోశాలకు కోడెల కోసం రావాలని తెలిపారు. అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. జియో ట్యాగింగ్ ఉన్న కోడెలు, వెబ్సైట్ లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చని స్పష్టం చేశారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని సూచించారు. పక్కదారి పట్టినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ హెచ్చరించారు.





## నూరు శాతం పన్ను వసూలుకు కృషిచేసిన కౌన్సిలర్లు, సిబ్బందికి సత్కారం

**సత్కరించిన చైర్ పర్సన్ జిందం కళ, కమిషనర్ ఖాదిర్ బాషా**

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 33, 35 వ వార్డులలో 100 శాతం ఇంటి పన్ను వసువులకు కృషిచేసిన వార్డు కౌన్సిలర్లు కొండ వర్షిని నరేష్, బత్తుల రమేష్, సంబంధిత వార్డు ఆఫీసర్, బిల్ కలెక్టర్‌లను మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి, కమిషనర్ ఎండి ఖాదిర్ ఫాషా, వైస్ చైర్మన్ దార్ల సందీప్ లు కాలువలతో సత్కరించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో డిఈ వాణి, రెవెన్యూ ఆఫీసర్ రామ్మోహన్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాయి కృష్ణ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిసి రోడ్డుకు భూమి పూజ




**ప్రజానావ, సిరిసిల్ల :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో ఈజిఎస్ ద్వారా మంత్రి సీతక్క చోరువతో ఉమ్మడి జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వేములవాడ శాసనసభ్యులు అది శ్రీనివాస్ ల ప్రత్యేక చొరవ చూపిన రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అస్మతుల్లా హుస్సేని, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ లకు జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్ కే సాహెబ్ ధన్యవాదాలు తెలిపారు. ఈజీఎస్ నిధులతో బొప్పాపూర్ గ్రామంలో రూ.25 లక్షలు మంజూరు కాగా ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షులు ఎస్.కె సాహెబ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నత్తడితో ఉండే అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియగా సాగుతున్నది అన్నారు. అలాగే పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయ్యాలనే ఉద్దేశం తో ఆరు గ్యారెంటీలతో పాటు అభివృద్ధి ధ్యేయంగా తెలంగాణ ముందుకు సాగుతుందని అన్నారు. ఈ నిధులకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ కొండాపురం వెంకటరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు వార్డ్ మెంబర్ చల్ల పద్మా రెడ్డి, స్థానిక వార్డ్ మెంబర్ కాంగ్రెస్ పార్టీ నాయకు రాలు నీరటి దేవవ్వ, భాను ఇల్లెందుల, రాజిరెడ్డి, ఏలూరి శ్రీనివాస్, కొండాపురం శ్రీనివాస్ రెడ్డి తదితర నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ముస్తాబాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రుల స్కానింగ్ సెంటర్లపై దాడులు

**నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు జరిమానాలు**

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజిత**



**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ మండలంలోని ప్రవేట్ ఆసుపత్రుల స్కానింగ్ సెంటర్లను శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రజిత ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించినారు. ఈ తనిఖీలలో రికార్డులను, స్కానింగ్ సెంటర్ల మిషన్లను పరిశీలించినారు. ఫారం ఎఫ్ ఆడిట్లను పరిశీలించి గర్భిణీ స్త్రీ వివరాలు, సంతకాలు తీసుకొని, గర్భిణీ స్త్రీ స్కానింగ్ వివరాల ఫిలింను జత పరచాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా గర్భిణీ స్త్రీ కి ఆడ మగ (లింగ నిర్ధారణ) అని సైగల ద్వారా తెలియజేసిన వారి స్కానింగ్ సెంటర్ లను సీజ్ చేస్తామని, రూ.10 వేల జరిమానా విధిస్తూ, మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తామని స్కానింగ్ నిర్వాహకులకు సూచిస్తూ, రిజిస్ట్రేషన్ లేని ప్రైవేట్ ఆస్పత్రులను నిర్వహించినట్లయితే క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారము చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహేష్ గౌడ్, నవీన లు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం:** జర్నలిస్టులకు కనీస వేతనం అమలు చేయడంతో పాటు ఇండ్ల స్థలాలు, వివిధ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. జీరో అవర్ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వారికి సబ్సిడీతో కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు అందించాలని పేర్కొన్నారు. అలాగే జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, జీవిత బీమా సదుపాయం కల్పించడంతో పాటు రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేయాలని కోరారు. చిన్న పత్రికలకు ప్రభుత్వ ప్రకటనలు (యాడ్స్) ఇవ్వడానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వివరించారు.

# మెగాలోక్ అదాలత్‌లో 14,820 కేసుల పరిష్కారం

- **జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ**



**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 14,820 కేసుల ను పరిష్కరించడం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి నీరజ వెల్లడించారు. ఈ కేసులలో రూ.6,74,41,119 లను నష్ట పరిహారంగా ఇప్పించడం జరిగిందని తెలిపారు. పరిష్కరించిన కేసుల వివరాలలో మోటార్ వాహన ప్రమాద కేసులు 13, సివిల్ తగాదాలు 17, క్రిమినల్ కేసులు 330, ఎక్సైజ్ కేసులు 43, చెక్ బౌన్స్ కేసులు 20, కుటుంబ తగాదాలు 10, బ్యాంకు కేసులు 45, బిఎస్ఎన్ఎల్ 10, డ్రంక్ అండ్ డ్రైవ్ 1851, ట్రాఫిక్ చలాన్ కేసులు 12481 ఉన్నట్టు జిల్లా న్యాయమూర్తి వెల్లడించారు.

# ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలపై సమీక్ష

**ఏప్రిల్ 20 టాస్ పరీక్ష**

**అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**



**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 27 వరకు ఓపెన్ (టాస్) ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సిరిసిల్లలో (03) సెంటర్లు, వేములవాడలో (02) సెంటర్లలో జరుగనున్నాయి. అలాగే ఏప్రిల్ 28 నుండి మే 05 వరకు ప్రాక్టికల్ పరీక్షలు (01) సెంటర్ లో జరుగనున్నాయి. ఈ పరీక్షల ఏర్పాట్ల కొరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్ ఆధ్వర్యంలో సంబంధిత జిల్లా అధికారులతో శనివారం అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ, పోస్టల్ శాఖ, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ అధికారులు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, జిల్లా విద్యాధికారి హాజరయ్యారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ జి. నగేష్ సంబంధిత అధికారులకు ఓపెన్ స్కూలు పరీక్షలు ప్రశాంతంగా జరుగుట కొరకు తగు సూచనలు ఇవ్వడం జరిగినదని జిల్లా విద్యాధికారిడా. బి. జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వేములవాడకు ఆర్టీసీ కనెక్టివిటీ పెంచండి

- అసెంబ్లీ కమిటీ సమావేశంలో సమస్యలను ప్రస్తావించిన ప్రభుత్వ విప్ ఆది
- బస్సుల పెంపు, బస్ స్టేషన్ల అభివృద్ధికి సూచనలు



**ప్రజానావ, వేములవాడ:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ కమిటీ హాల్–1లో ఆర్టీసీ సమస్యలపై మూడో రోజు నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల ప్రజాప్రతినిధులతో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడకు అన్ని జిల్లాల నుంచి కనెక్టివిటీ పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సిరిసిల్ల, కోరుట్ల, జగిత్యాల, మెట్పల్లి డిపోల నుంచి వేములవాడకు బస్సుల సంఖ్యను పెంచాలని సూచించారు. వేములవాడ పరిధిలోని బస్ స్టేషన్లను అభివృద్ధి చేయాలని, కథలాపూర్ మండలం రాజారాం తండా, కథలాపూర్, కొండాపూర్, గంభీర్‌పూర్ వరకు వస్తున్న బస్సులను మోత్కూరావుపేట, గోవిందారం వరకు విస్తరించాలని కోరారు. అలాగే చందుర్తి నుంచి మర్రిమడ్ల వరకు కొత్త బస్సు సర్వీసులు నడపాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో వేములవాడ నుంచి ముంబైకి ప్రారంభమైన బస్సు సర్వీసులు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. మేడిపల్లి మండల కేంద్రంలోని బస్ స్టేషన్‌లో టాయిలెట్లు నిర్మించాలని కూడా సమావేశంలో సూచించారు.

# శస్త్ర చికిత్సలో నిర్లక్ష్యం

**కుడి వేలికి బదులు ఎడమ వేలు తొలగింపు**

**పండర్‌పూర్ ఆసుపత్రి ఘటనపై తల్లిదండ్రుల ఆగ్రహం**

**ప్రజానావ, ముంబై:** వైద్యుల నిర్లక్ష్యం కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్న ఘటనలు కొనసాగుతుండగా, పండర్‌పూర్‌లో మరో దిగ్భ్రాంతికర సంఘటన వెలుగులోకి వచ్చింది. ఆరేళ్ల బాలుడి శస్త్రచికిత్సలో ఘోర నిర్లక్ష్యం చోటుచేసుకుని, కుడి చేతి వేలికి బదులుగా ఎడమ చేతి వేలిని తొలగించిన ఘటన కలకలం రేపింది. షోలాపూర్ జిల్లా పండర్‌పూర్ ఉప–జిల్లా ఆసుపత్రిలో ఈ ఘటన జరిగింది. బాలుడు షాహు సునీల్ దండాడేకు రెండు చేతుల్లో అదనపు వేళ్లు ఉండగా, కుడి చేతి వేలు నొప్పి కారణంగా దానిని తొలగించాలని నిర్ణయించారు. అయితే శస్త్రచికిత్స సమయంలో వైద్యుడు పొరపాటున ఎడమ చేతి వేలిని తొలగించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై బాలుడి తల్లిదండ్రులు ఆసుపత్రి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పొరపాటు జరిగిన తర్వాత కూడా వైద్యుడు విషయం దాచిపెట్టేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. అదనంగా, “ఆ వేలు కూడా ఎప్పటికైనా తీసివేయాల్సిందే” అంటూ అస్పష్టమైన సమాధానాలు ఇచ్చారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటన వైద్య రంగంలో తీవ్ర చర్చకు దారితీసింది. కుడి చేతి వేలికి బదులుగా ఎడమ వేలిని తొలగించారన్న ఆరోపణ స్థానికంగా పెద్ద కుదుపును సృష్టించింది. ఈ విషయంపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని మెడికల్ సూపరింటెండెంట్ తెలిపారు.

# డిజిటల్ అరెస్ట్ పేరిట మోసం

**ట్రాయ్, సీబీఐ అధికారులుగా బెదిరింపులు**

**రూ.90.85 లక్షలు దోచిన నిందితుడు అరెస్ట్**

**కేరళలో గోవా సైబర్ పోలీసుల ఆపరేషన్ సక్సెస్**

**ప్రజానావ, ముంబై:** ట్రాయ్, సీబీఐ అధికారులుగా నటిస్తూ “డిజిటల్ అరెస్ట్” పేరిట పనాజీకి చెందిన వ్యక్తిని రూ.90 లక్షల 85 వేల వరకు మోసం చేసిన నిందితుడిని గోవా సైబర్ క్రైమ్ పోలీసులు కేరళలో అరెస్టు చేశారు. అరెస్టు అయిన వ్యక్తిని మహమ్మద్ రసిక్ అలవి పులిక్కల్ (21), మలప్పురం, కేరళ నివాసిగా గుర్తించారు. అతనిపై భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 318(4), 319(2), అలాగే ఐటీ చట్టంలోని సెక్షన్ 66–డి కింద కేసు నమోదు చేశారు. ఫిబ్రవరి 23, 2026కు ముందు కాలంలో నిందితుడు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్), ముంబై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అధికారిగా నటిస్తూ ఫిర్యాదిదారుడిని వాట్సాప్ ద్వారా సంప్రదించాడు. ఒక ప్రముఖ వ్యక్తికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అతనికి సంబంధం ఉందని ఆరోపిస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. అంతేకాకుండా, బాధితుడిని చట్టవిరుద్ధంగా “డిజిటల్ అరెస్ట్” చేసినట్లు చెప్పి కేసు నుంచి బయటపడాలంటే తన ఖాతాకు డబ్బులు బదిలీ చేయాలని ఒత్తిడి చేశాడు. దీంతో భయాందోళనకు గురైన బాధితుడు రూ.90,85,000 మొత్తాన్ని నిందితుడి ఖాతాకు బదిలీ చేశాడు. ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి, నిందితుడు కేరళలో ఉన్నట్లు గుర్తించారు. పోలీస్ సబ్–ఇన్‌స్పెక్టర్ నవీన్ నాయక్, కానిస్టేబుల్ యశ్ కోలే, సిహోరమయ్య మఠ్ నేతృత్వంలోని బృందం కేరళకు వెళ్లి నిందితుడిని అరెస్ట్ చేసింది. అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి. వి. శ్రీదేవి పర్యవేక్షణలో, సైబర్ క్రైమ్ బ్రాంచ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాజు రౌత్–దేశాయ్ మార్గదర్శకత్వంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ దీపక్ పెడ్నేకర్ ఈ కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# వేములవాడలో గంజాయి సాగు

**నిందితుడి అరెస్ట్.. మొక్కలు స్వాధీనం**

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ పట్టణ పరిధిలోని అగ్రహారం గ్రామ శివారులో గంజాయి మొక్కలను అక్రమంగా సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అచ్చే లాల్ అనే వ్యక్తి ఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. సమాచారం అందిన వెంటనే ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని, పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఏ. శ్రీనివాసులు గంజాయి మొక్కలను స్వాధీనం చేసిన ఎస్సై శ్రీనివాస్, పీసీ మహిపాల్, పీసీ సంతోష్, హోంగార్డ్ ఆనంద్‌లను అభినందించారు. గంజాయి సాగు, రవాణా, విక్రయం లేదా వినియోగం వంటి నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై



సమాచారం ఉన్నవారు స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.



## పేదలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజానావ, ఎల్లారెడ్డిపేట:** పేదలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సాబేరా బేగం గౌస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో శనివారం నూతన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు సొంత ఇల్లు కలగడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంలో ఈ పథకం కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాటి రాంరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మెండే సిను, టౌన్ ప్రెసిడెంట్ చెనీ బాబు, బుచ గౌడ్, బండారి బాల్ రెడ్డి, ఇమామ్, సంతోష్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల గడువు పొడిగింపు



**ప్రజానావ, మంచిర్యాల:** 2025-26 సంవత్సరానికి సంబంధించి షెడ్యూల్డ్ కులాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ఆమోదించిన మొదటి విడత పథకాల కోసం అర్హత గల ఎస్సీ యువత దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఏప్రిల్ 2 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం ఈఈ చాతరాజుల దుర్గాప్రసాద్ తెలిపారు. రవాణా రంగంలో ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన ఈవి ద్విచక్ర వాహనాల కోసం లక్ష్యం 185 యూనిట్లు ఉండగా 608 దరఖాస్తులు, ఈవి త్రిచక్ర వాహనాల కోసం లక్ష్యం 91 యూనిట్లు ఉండగా 838 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ పథకాల్లో సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్, వ్యవసాయ అనుబంధ భాగాలకు లక్ష్యం 19 యూనిట్లు ఉండగా, 73 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చినట్లు తెలిపారు. అర్హత గల ఎస్సీ యువత https://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజా భవన్‌లో అన్నదానం



**ప్రజానావ, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజా భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, సీనియర్ నాయకురాలు అఫ్రోజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదల ఆకలి తీర్చేందుకు కంది శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రతిరోజూ నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం ద్వారా పేదలకు ఆహారం అందించడం గొప్ప సేవగా అభివర్ణించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు.

## 30న బిల్డింగ్ వర్కర్స్ 'చలో హైదరాబాద్'

**ప్రజానావ, సత్తుపల్లి:** బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' లేబర్ కమిషనరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఖమ్మం జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం గ్రామంలో కాలేషా ఆధ్వర్యంలో జరిగిన అసంఘటిత రంగ కార్మికుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ చట్టాన్ని బలహీనపరుస్తూ ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించడం దుర్మార్గమని విమర్శించారు. సిఎస్‌సి హెల్త్ టెస్టుల పేరుతో కోట్ల రూపాయల దోపిడి జరుగుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికుల సొమ్మును కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లకు మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. అంగన్వాడి, ఆశ తదితర రంగాల కార్మికుల పోరాటాలను అణచివేస్తూ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, మహిళలను సైతం అర్ధరాత్రి సమయంలో అరెస్టు చేయించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.



# ఇళ్లపై సోలార్ ఏర్పాటు చేయండి

- ప్రజాప్రతినిధులకు బండి సంజయ్ పిలుపు
- కోటి ఇండ్లలో ఏర్పాటే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం
- తన నివాసంలో సోలార్ వ్యవస్థ పరిశీలించిన కేంద్ర మంత్రి

**ప్రజానావ, కరీంనగర్:** ప్రజాప్రతినిధులు తమ ఇళ్లపై సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలవాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని వార్డు సభ్యుల నుంచి సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్ల వరకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. కరీంనగర్ జమ్మికుంటకు చెందిన కార్తికేయ సోలార్ పవర్ ఇన్‌స్టలేషన్ సంస్థ ఏర్పాటు చేసిన సోలార్ వ్యవస్థను మంత్రి తన నివాసంలో అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోటి ఇండ్లలో సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇందు కోసం రూ.75 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించి నట్లు చెప్పారు. సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు ద్వారా ప్రజలు విద్యుత్ కొనుగోలు చేసే స్థాయి నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసి అమ్మే స్థాయికి ఎదగాలని సూచించారు. సోలార్ ప్యానెల్‌లపై సబ్సిడీతో పాటు 80 శాతం వరకు రుణ సౌకర్యం కూడా అందుబాటులో ఉందని, పేదలు కూడా సులభంగా ఈ వ్యవస్థను ఏర్పాటు చేసుకునే అవకాశముందని తెలిపారు. ప్రధాని పిలుపు మేరకు తన నివాసంలో సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీజీరెడ్కో అధికారులు, డిస్ట్రిబ్యూటర్‌తో కలిసి సోలార్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. రాష్ట్ర ప్రజలందరికీ సోలార్ వ్యవస్థపై పూర్తి అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు.




# వేములవాడ గౌడ సత్రం సేవలు ఆదర్శం

- అన్నదాన సేవలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశంసలు



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడలో నిర్వహిస్తున్న అఖిల భారత శ్రీ రాజరాజేశ్వరి రేణుక ఎల్లమ్మ గౌడ నిత్య అన్నదాన సత్రం సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు గౌడ కుల బాంధవులు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. శనివారం కరీంనగర్ పట్టణంలోని శ్రీ మహాశక్తి అమ్మవారి ఆలయంలో గౌడ సత్రం చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో గౌడ సమాజ అభ్యున్నతికి కట్టుబడి సినీ నటుడు డాక్టర్ సుమన్ సారథ్యంలో వేములవాడలో గౌడ సత్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించేందుకు వచ్చే భక్తులకు నిత్యం అన్నదాన సేవలు అందించడం భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి డాక్టర్ సుమన్ గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ, మహంకాళి శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో సత్రం సమర్థవంతంగా కొనసాగడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో సత్రానికి తనవంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. చిన్న వయసులోనే గౌడ సమాజానికి విశేష సేవలు అందిస్తున్న మహంకాళి శ్రీనివాస్ గౌడ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో ఈ సత్రం మరింత విస్తరించి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నమనేని వికాస్ రావు, కాశి పీఠాధిపతి శ్రీమాన్, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు రేగుల మల్లికార్జున్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కోల కృష్ణస్వామి, రాష్ట్ర నాయకులు దాది అశోక్, గౌడ సత్రం డైరెక్టర్లు సురగోని రాజు, భైరవుని దేవయ్య, అబ్బగోని సురేష్, రావుల రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.






# తొక్కిసలాట మృతులకు నివాళి

## స్మారకార్థం 11 సీట్లు కేటాయింపు

**బెంగళూరు:** ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ ఆరంభ పోరులో చిన్నస్వామి తొక్కిసలాట మృతులకు నివాళులు అర్పించారు. టాస్ అనంతరం ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లతో పాటు స్టాండ్స్‌లోని అభిమానులందరూ లేచి నిల్చొని మౌనం పాటించారు. ఇదివరకూ చెప్పినట్టుగానే ఆ పదకొండు మంది జ్ఞాపకార్థం కర్నాటక క్రికెట్ సంఘం ప్రత్యేకంగా 11 సీట్లను కేటాయించింది. జాతీయ గీతం ఆలాపన అనంతరం మ్యాచ్ ప్రారంభమైంది. ఐపీఎల్ ఫ్రాంచైజీ ఆర్సీబీ , కర్నాటక క్రికెట్ సంఘం మాట నిలబెట్టుకున్నాయి. నిరుడు జూన్ 4వ తేదీన మరణించిన 11 మంది జ్ఞాపకార్థం చిన్నస్వామి స్టేడియంలో స్మారకం ఏర్పాటు చేయడంతో పాటు పదకొండు ప్రత్యేక సీట్లను కేటాయించాయి. ఇదివరకే మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన ఆర్సీబీ.. ఇప్పుడు వారిని ప్రత్యేకంగా స్మరించుకుంది.

# ఇదేం బ్యాటింగ్ భయ్యా..

## భారీ హిట్టింగ్ చేస్తారనుకుంటే పెవిలియన్‌కి క్యూ కట్టారు..

### షాక్‌లో ఎస్ఆర్‌హెచ్





**బెంగళూరు:** క్రికెట్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ గ్రాండ్‌గా మొదలైంది. చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరుగుతున్న ఈ తొలి మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లు తేలిపోయారు. టాస్ గెలిచిన ఆర్సీబీ మొదట ఫిల్డింగ్ తీసుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ కి వచ్చిన ఆరెంజ్ ఆర్మీ బ్యాటర్లు చెలరేగిపోతారని అనుకుంటే తుస్సుమనిపించారు. మొదటి ఓవర్లు ఓ సిక్సు కొట్టిన అభిషేక్ శర్మ మంచి ఊపు మీద కనిపించాడు.. ఫస్ట్ రెండు ఓవర్లలో 17 పరుగులు చేసిన ఎస్ ఆర్ హెచ్.. మూడో ఓవర్ లో బౌలింగ్ కి వచ్చిన జాకబ్ డఫీ బౌలింగ్ లోనే భారీ షాట్ ఆడబోయిన అభిషేక్ వికెట్ కీపర్ జితేష్ శర్మకి క్యాచ్ ఇచ్చిన అభి పెవిలియన్ కు చేరుకున్నాడు. కేవలం 8 బంతుల్లో 7 పరుగులు చేశాడు. అనంతరం మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ సైతం ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. 9 బంతుల్లో రెండు ఫోర్లు కొట్టి అదే ఓవర్లో జాకబ్ బౌలింగ్ లో ఔట్ అయ్యాడు. బౌండరీ లైన్ వద్ద ఫిల్ సాల్ట్‌కి క్యాచ్ ఇచ్చిన హెడ్ డకౌట్ కి వెళ్లిపోయాడు. అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన లోకల్ బాయ్ నితిశ్ కుమార్ రెడ్డి మాత్రం దారుణంగా విఫలమయ్యాడు. దాదాపు 6 బంతులు కేవలం 1 పరుగు మాత్రమే చేసి అభినందన్ సింగ్ కి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ కి వెళ్లిపోయాడు. దీంతో బ్యాటింగ్ భారం మొత్త కెప్టెన్ ఇషన్ కిషన్ పై పడింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో భారీ హిట్టర్లకు పెట్టింది పేరు.. అలాంటి హిట్టర్లు ఈ మ్యాచులో ఘోరంగా విఫలమయ్యారు. ఎస్ఆర్ హెచ్ కోల్పోయిన మూడు వికెట్లను ఆర్సీబీ బౌలర్ జాకబ్ డఫీ ఒక్కడే తీసుకోవడం గమనార్హం. కీలకమైన వికెట్లు కోల్పోయిన ఆరెంజ్ ఆర్మీ కష్టాల్లో పడింది. ప్రస్తుతం క్రీజులో కెప్టెన్ ఇషాన్ (33బి), హెన్రీచ్ క్లాసెన్ (4బి) ఉన్నారు.



# పాక్ క్రికెట్‌కు ఘోర అవమానం

## ప్లేయర్లతో పాటు షాక్ ఇస్తున్న కామెంటేటర్లు..

**న్యూఢిల్లీ:** పాకిస్తాన్ క్రికెట్ రోజురోజుకు దిగజారిపోతుంది. వరసగా అవమానాలు ఎదురవుతూనే ఉన్నాయి. పాకిస్తాన్ సూపర్ లీగ్ నుంచి విదేశీ క్రికెటర్లు బయటకు వస్తున్నారు. వీరంతా ఇండియన్ ప్రీమియర్ లీగ్లో ఆడేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఐపీఎల్‌లో అమ్ముడుపోని క్రికెటర్లు మాత్రమే పీఎస్‌ఎల్‌లో ఆడుతున్నారనే ప్రచారం ఉంది. ఇక ఇప్పుడు, కామెంటేటర్లు కూడా పీఎస్ఎల్ వీడి ఐపీఎల్ కోసం వస్తున్నారు. పీఎస్ఎల్ కామెంటేటర్స్ ప్యానెల్‌లో ఉన్న మాజీ ఇంగ్లాండ్ స్టాన్ నిక్ నైట్, ఇప్పుడు ఐపీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనికి ముందు ప్లేయర్లు దాసున్ శనక, స్పెన్సర్ జాన్సన్, బ్లెస్సింగ్ ముజరబాని వంటి ఆటగాళ్లు పీఎస్ఎల్ వీడి ఐపీఎల్‌లో చేరారు. పాక్ క్రికెట్ బోర్డ్(పీసీబీ) చీఫ్ మోహ్సిన్ నఖ్వీకి ఈ పరిణామాలు తీవ్ర అవమానంగా మిగిలిపోతున్నాయి. వెళ్లిపోయిన ఆటగాళ్లపై చర్యలు తీసుకుంటామని నఖ్వీ హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉంటే, శుక్రవారం పీఎస్ఎల్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. లాహోర్‌లో లాహోర్ ఖలందర్స్, హైదరాబాద్ కింగ్స్ మెన్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ కూడా చాలా నిశ్శబ్ధంగా జరిగింది. ప్రేక్షకులు ఎవరూ మ్యాచ్‌కు హాజరుకాలేదు. ఎలాంటి హడావుడి లేకుండా, ప్రారంభ కార్యక్రమాలు లేకుండా టోర్నీ ప్రారంభమైంది. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రజలు పెట్రోల్, డిజల్ ఆదా చేసే పనిలో ఉన్నారు. దీంతోనే ప్రేక్షకులు ఎవరూ మ్యాచ్‌కు రాలేదు. దీనికి తోడు తాలిబాన్‌తో జరుగుతున్న యుద్ధం కూడా పీఎస్ఎల్ భద్రతపై ప్రభావం చూపుతున్నాయి.



# గంభీర్ పేరుతో ఉన్న ఏఐ వీడియోలు 36 గంటల్లో తొలగించాలి

## ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ:** టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు ఢిల్లీ హైకోర్టు ఊరట లభించింది. తన పేరును వాడుకుంటూ ఏఐ జనరేటెడ్ వీడియోలు తీశారని గంభీర్ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. శనివారం ఢిల్లీ హైకోర్టు ఈ అంశంపై విచారణ జరిపి కీలక తీర్పు వెలువరించింది. గంభీర్ పేరు, ఫొటో, వాయిస్ లేదా ఏఐ జనరేటెడ్‌తో కూడిన వీడియోలను 36 గంటల్లో తొలగించాలని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లను కోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ జ్యోతి సింగ్ ధర్మాసనం తీర్పునిచ్చింది.గంభీర్ తరఫున న్యాయవాదులు పలు సోషల్ మీడియా ఖాతాలను కోర్టు ముందుంచారు. ఆన్‌లైన్ అతడి గుర్తింపును దుర్వినియోగం చేసినట్లు వాదనలు వినిపించారు. దీంతో ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, అమెజాన్, ఫ్లిప్ కార్ట్‌తో పాటు ఇతర సోషల్ మీడియా ఖాతాల్లోని కంటెంట్‌ను 36 గంటల్లో తొలగించాలని కోర్టు స్పష్టం చేసింది. ముమ్మందు ఇలాంటి అవాంఛిత కంటెంట్ ఆయా ఖాతాల్లో రాకుండా చూడాలని హెచ్చరించింది. ఉల్లంఘనకు పాల్పడిన బాధ్యుల వివరాలను వెల్లడించాలని ఆదేశించింది. భారత క్రికెట్‌కు ప్రధాన కోచ్‌గా ఉన్న గంభీర్ తన వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదించే హక్కును కాలరాయడం తగదని హైకోర్టు పేర్కొంది.



# ఐపీఎల్‌కు ధోనీ దూరం..

## శాంసన్‌కు భలే ఛాన్స్!

**న్యూఢిల్లీ:** పంతొమ్మిదో సీజన్ ఆరంభానికి ముందే చెన్నై సూపర్ కింగ్స్ కు పెద్ద షాక్. తొలి ఎడిషన్ నుంచి సీఎస్కేకు ఆడుతున్న మహేంద్ర సింగ్ ధోనీ మెగా టోర్నీకి దూరం కానున్నాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకోని ధోనీ తొలి రెండు వారాలు ఐపీఎల్‌కు అందుబాటులో ఉండడం లేదు. తమ వెటరన్ ఆటగాడు మెగా ఈవెంట్‌కు కొన్ని రోజులు దూరం అవుతున్నాడని శనివారం సీఎస్కే యాజమాన్యం వెల్లడించింది. ధోనీ లేకుండా చెన్నై జట్టు ఐపీఎల్ ఆడనుండడం ఇదే మొదటిసారి కానుంది. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటి నుంచి పూర్తిగా ఐపీఎల్‌కే అంకితమైన మహేంద్ర సింగ్ ధోనీ తొలిసారి టోర్నీకి దూరమవుతున్నాడు. ఆరంభ సీజన్ నుంచి బ్రేక్ లేకుండా ఆడుతున్న తాలా ఈసారి కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడు. గత సీజన్ ఫైనల్లో మోకాలి గాయంతోనే ఆడిన ధోనీ అనంతరం సర్జరీ చేయించుకున్నాడు. ఈ గాయం నుంచి కోలుకున్నా.. కండరాల గాయం ధోనీని వెంటాడింది. దాంతో, అతడికి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. అందుకే రెండు వారాలు సీఎస్కే మ్యాచ్‌లకు ధోనీ దూరం కానున్నాడు. పంతొమ్మిదో ఎడిషన్ తొలి మ్యాచ్‌లో మార్చి 30న రాజస్థాన్ రాయల్స్‌తో సీఎస్కే తలపడనుంది. రికార్డు స్థాయిలో 278 మ్యాచ్‌లు ఆడిన ధోనీ గౌర్హాజరీలో సంజూ శాంసన్ కు వికెట్ కీపింగ్ అప్పగించే అవకాశముంది. ఇటీవలే ట్రేడ్ పద్ధతిన సీఎస్కే గూటికి చేరిన శాంసన్



ఓపెనర్‌గా, వికెట్ కీపర్‌గా తన ముద్ర వేసేందుకు ఇంతకుమించిన సమయం ఉండదేమో.


ప్రజానావ
హైదరాబాద్ | ఆదివారం 29 మార్చి 2026



# చెల్లి నిర్మాత.. అన్న హీరోగా బరిలోకి

## వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు పవన్ క్లాప్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మెంత్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్కృతి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌లతో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



# అక్షయ్‌ఖన్నాకు ప్రశాంత్ గ్రీటింగ్స్

## మహాకాళిపై త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ప్రకటన

బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా కేవలం తన నటనతోనే మాట్లాడతారని, ఆయనతో కలిసి పనిచేయడం తనకు దక్కిన గౌరవమని ప్రశాంత్ వర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ప్రశాంత్ వర్మ ప్రత్యేక పోస్ట్‌ను పంచుకున్నాడు. నిజమైన టాలెంట్‌కు అరుపులు అవసరం లేదని నిరూపించే నటుడు అక్షయ్ ఖన్నా. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, పెర్ఫార్మెన్స్ ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన క్లాస్‌ను చాటుతాయని ప్రశాంత్ వర్మ కొనియాడారు. అలాగే ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న 'మహాకాళి', 'అధీర', మరియు 'జై హనుమాన్' చిత్రాల గురించి త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ ఇస్తామని హింట్ ఇచ్చాడు. అక్షయ్ ఖన్నా ప్రస్తుతం ప్రశాంత్ వర్మ నిర్మిస్తున్న 'మహాకాళి' చిత్రంలో అసుర గురువు 'శుక్రాచార్యుడి' పాత్రలో నటిస్తున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం కావడం విశేషం. ప్రస్తుతం అక్షయ్ ఖన్నాకు సంబంధించిన షూటింగ్ పార్ట్ పూర్తయిందని, అవుట్‌పుట్ చాలా అద్భుతంగా వచ్చిందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ వర్మ క్రియేట్ చేస్తున్న ఈ మైథలాజికల్ యూనివర్స్ కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.




# దురంధర్-2 ఓ చెత్త సినిమా

## అక్కసు వెళ్లగక్కిన ఓవైసీ



ధురంధర్ 2' సినిమాపై హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ 'తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్నప్పటికీ, ఒవైసీ మాత్రం దీనిని ఒక చెత్త సినిమాగా అభివర్ణించారు. ఒక మీడియా సదస్సులో ఒవైసీ మాట్లాడుతూ.. 'ధురంధర్ 2' వంటి మూడు గంటల పనికిరాని సినిమాలను చూసే సమయం తనకు లేదని అన్నారు. ఈ చిత్రం పూర్తిగా హింసను ప్రేరేపించేలా ఉందంటూ ఆయన మండిపడ్డారు. అసలు అది ఒక సినిమానా? అందులో మూడు గంటల పాటు కేవలం బూతులు, హింస తప్ప మరేమీ లేదు' అని ఆయన కొట్టిపారేశారు. ఈ సినిమాలో ముస్లింలను చిత్రీకరించిన విధానంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఈ సినిమాకు బ్రహ్మరథం పడుతున్నారని గుర్తు చేయగా.. ఆయన తనదైన శైలిలో హైదరాబాదీ యాసలో స్పందిస్తూ, ఇలాంటి విషయాలను తాను పట్టించుకోనని తేల్చి చెప్పారు.



## సినిమాలన్నీ అట్టర్ ప్లాప్..

# కానీ లైఫ్ సెటిల్డ్!

వెండితెరపై మెరిసిపోవాలని, స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకోవాలని ఎందరో ముద్దుగుమ్మలు కలలు కంటారు. కానీ అందం, అభినయం ఉన్నా అందరికీ అదృష్టం కలిసిరాదు. సరిగ్గా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంది అందాల భామ ఆదితి ఆర్య. టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ చేతుల మీదుగా హీరోయిన్‌గా పరిచయమైనా.. కెరీర్ పరంగా ఆశించిన సక్సెస్ అందుకోలేకపోయింది. అయితే, రీల్ లైఫ్‌లో ప్లాపులు ఎదురైనా, రియల్ లైఫ్‌లో మాత్రం ఏకంగా రూ. 12 వేల కోట్ల సామ్రాజ్యానికి కోడలై అందరినీ ఆశ్చర్యపరిచింది. చండీగఢ్‌లో జన్మించిన ఆదితి ఆర్య చదువులో టాపర్. ఫైనాన్స్, బిజినెస్ స్టడీస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఈమె, మోడలింగ్‌పై ఆసక్తితో 'ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ 2015' కిరీటాన్ని కైవసం చేసుకుంది. ఆ గుర్తింపుతోనే నందమూరి కల్యాణ్‌రామ్ సరసన 'ఇజం' చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమాలో గ్లామర్ పరంగా మంచి మార్కులు కొట్టేసినా, సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడింది. ఆ తర్వాత కన్నడలో 'తంత్ర', హిందీలో రణవీర్ సింగ్ నటించిన '83' వంటి చిత్రాల్లో నటించినా అవేవీ ఆమె కెరీర్‌ను మలుపు తిప్పలేకపోయాయి. సినిమాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, ఆదితి ఆర్య తన కెరీర్ బాట మార్చుకుంది. భారతదేశంలోని అత్యంత ధనవంతులైన బ్యాంకర్లలో ఒకరైన ఉదయ్ కోటక్ కుమారుడు జై కోటక్ తో ప్రేమలో పడింది. వీరిద్దరూ కొన్నాళ్ల పాటు డేటింగ్ చేసి, గత ఏడాది ఘనంగా వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం జై కోటక్ తన తండ్రి వ్యాపార సామ్రాజ్యాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. తాజా నివేదికల ప్రకారం జై కోటక్ ఆస్తుల విలువ దాదాపు రూ.12 వేల కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. సినిమాల్లో సక్సెస్ కాకపోయినా, తన చదువు, సంస్కారంతో ఏకంగా ఒక బిలియనీర్ ఫ్యామిలీకి కోడలిగా వెళ్లి, ఇప్పుడు వైవాహిక జీవితంలో ఎంతో సంతోషంగా గడుపుతోంది ఈ మాజీ మిస్ ఇండియా.



Published and Editor Owned by **Adula Thirupathi,** and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. **Phone No: 99484 33277.**